క్లుప్తంగా

ఘనంగా ఖండేరాయ ఉత్సవాలు ప్రారంభం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని ఉత్తునూర్ గ్రామంలో ఖండేరాయ ఆలయ వార్షికోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సదాశివనగర్‌కు చెందిన సనాతన భజన మండలి ఆధ్వర్యంలో భజన కీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ దొడ్లె రవి, వీడీసీ ప్రతినిధులు, గ్రామస్తులు, యువజన సంఘాల సభ్యులు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామపెద్దలు హైదరాబాద్‌లో సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను కలిశారు. మర్యాదపూర్వకంగా కలసి తాడ్వాయిని అభివృద్ధి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆకిటి వెంకట్‌రాంరెడ్డి, జంగం రాజు, శ్యాంరావు,సుగునాకర్‌రెడ్డి, బాలకిషన్‌రావు, రాంచందర్‌రావు, ప్రతాపరెడ్డి, కిషన్‌రావు కలిసిన వారిలో ఉన్నారు.

క్రీడల్లో విజేతలకు బహుమతుల ప్రదానం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కృష్ణాజీవాడి గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. మూడో వార్షికోత్సవం సందర్భంగా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బ్యాట్మింటన్, క్విజ్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాయిరెడ్డి మాట్లాడుతూ కృష్ణాజీవాడి ఉద్యోగుల సంఘం సభ్యులం 50మంది ఉన్నామని గ్రామాభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగంభూషణం, మాజీ ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, ఉద్యోగులు రమేష్, శ్రీధర్‌రావు, నర్సిములు తదితరులున్నారు.

డీఎస్సీకి అర్హులుగా గుర్తించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : బీఎస్సీ ఫిషరీస్, బీఎస్సీ ఫారెస్ట్రీ విద్యార్థులకు స్కూల్ అసిస్టెంట్ అర్హత కల్పించే విధంగా డీఎస్సీలో అవకాశం కల్పించాలని కోరుతూ సోమవారం ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావును కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. గతంలో కాంగ్రెస్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2012లో ఈ కోర్సు చేసిన విద్యార్థులకు స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్‌కు అర్హత కల్పించారన్నారు. కానీ తర్వాత ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వం తమ అర్హతను తొలగించిందన్నారు.

పోలింగ్ స్టేషన్ల బాధ్యత సెక్టోరియల్ అధికారులదే..



ఎల్లారెడ్డి : సెక్టోరియల్ అధికారులు వారికి కేటాయించిన రూట్లకు సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించాలని తహసీల్దార్ మహేందర్ కుమార్ అన్నారు. సోమవారం మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెక్టోరియల్ అధికారులకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే వివరాలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్‌నాయక్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట ఎస్సైలు మహేష్, రాజు, చైతన్య కుమార్, సెక్టోరియల్ అధికారులు తదితరులున్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా సాగుతుంది. ఆదివారం నాటికి 3లక్షల 14వేల 786 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావ్ తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామన్నారు.

ప్రత్యేక నిధులతో పట్టణాభివృద్ధి

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీతో కాంగ్రెస్ కౌన్సిలర్లు, కమిషనర్ సుజాత





రాష్ట్ర చేనేత క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న షబ్బీర్ అలీ, సీఆర్పీల డైరీని ఆవిష్కరిస్తూ..

కామారెడ్డి టౌన్ : పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధికి ప్రత్యేక నిధులను మంజూరు చేయిస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం తన నివాసంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కాంగ్రెస్ కౌన్సిలర్లతో సమీక్ష నిర్వహించారు. ఎస్‌డీఎఫ్ నిధులతో ప్రతివార్డుకు రూ. 10 లక్షలు మంజూరుతో మురికి కాలువలు, రోడ్లు, ఇతర పనులు చేయిస్తామన్నారు. కౌన్సిలర్లు వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, కౌన్సిలర్లు షేరు, శివకృష్ణమూర్తి, రాజు, రమేష్, చాట్ల రాజేశ్వర్, అన్వర్ హైమాద్, రవి తదితరులున్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రానికి చెందిన ఎస్సీసెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు బంటు భూమేశ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బడుగుబలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని కోరినట్లు భూమేశ్ పేర్కొన్నారు.

రాష్ట్ర చేనేత క్యాలెండర్ ఆవిష్కరణ

కామారెడ్డి టౌన్ : తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్యవేదిక క్యాలెండర్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహదారు షబ్బీర్ అలీ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బరి కృష్ణహరి, జిల్లా అధ్యక్షుడు సిద్దరాములు, నాయకులు చాట్ల రాజేశ్వర్, ధర్మపురి, వెంకటస్వామి తదితరులున్నారు.

సీఆర్పీల డైరీ ఆవిష్కరణ

కామారెడ్డి రూరల్ : సమగ్ర శిక్ష క్లస్టర్ రిసోర్స్ పర్సన్ డైరీని సోమవారం తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ 15 ఏళ్ల నుండి విద్యాశాఖలో రాష్ట్రవ్యాప్తంగా 18వేల ఉద్యోగులం పనిచేస్తున్నామని విద్యారంగంలోకీలక పాత్ర పోషిస్తున్న వారికి న్యాయం చేయాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని అప్పటివరకు పే స్కేల్ అమలు చేయాలని కోరగా తమ న్యాయమైన డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.నాయకులు రాములు, సూర్య పాల్, చిరంజీవి, మహమూద్ ఉన్నారు.

సేవాలాల్ జయంతిని సక్సెస్ చేయాలి



మొగులాన్‌పల్లి తండాలో మాట్లాడుతున్న రూప్‌సింగ్

బాన్సువాడ రూరల్ : ప్రభుత్వం ఈనెల 27న అధికారికంగా నిర్వహిస్తున్న శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని గిరిజనులు విజయవంతం చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాము రాథోడ్, కాత్రోత్ రూప్‌సింగ్ కోరారు. బాన్సువాడలోని బంజారా భవన్‌లో అధికారికంగా జరిగే ఉత్సవాలకు ప్రతి గిరిజన తండానుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ మేరకు సోమవారం మండల ప్రధాన కార్యదర్శి కాత్రోత్ రూప్‌సింగ్ మండలంలోని గ్రామాల్లో పర్యటించి జనసమీకరణకు ఏర్పాట్లు చేశారు. ఆయన వెంట రతన్, అంబర్‌సింగ్, మోహన్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి అబాకస్‌లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని సంస్కృతిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని న్యూ ఆదర్శ్ స్కూల్‌కి చెందిన వడ్డెవార్ సాయి సంస్కృతి అబాకస్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయి అబాకస్ పోటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్స్‌పాల్ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం రాష్ట్రస్థాయి అబాకస్‌లో పాఠశాలకు చెందిన సాయి సంస్కృతి, మచ్కూరి యాత్ర ఇద్దరు విద్యార్థినులు హాజరయ్యారన్నారు. రాష్ట్రస్థాయిలో యాత్ర అనే విద్యార్థికి తృతీయ స్థానం దక్కిందన్నారు. చైన్నైలో జరిగే జాతీయస్థాయి పోటీలకు సాయి సంస్కృతి ఎంపిక కావడంపై పాఠశాల ఉపాధ్యాయులు నాందేవ్, విఠల్, రమ్య, గ్రామస్తులు అభినందించారు.

పరీక్షలంటే భయపడొద్దు



విద్యార్థులకు ప్యాడ్‌లను అందజేస్తున్న ప్రతినిధులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : పరీక్షలు అంటే భయపడవద్దని కష్టపడి, ఇష్టంగా చదువాలని హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు కృష్ణాకర్, హేమంత్‌కుమార్ అన్నారు. మండలంలోని చిట్యాల ఉన్నత పాఠశాలలో సోమవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో విజయస్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి విద్యార్థి ప్రణాళికతో ముందుకు సాగాలని, సంకల్పం గట్టిదైతే విజయం సాధిస్తారన్నారు. విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కిష్టయ్య, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు స్వామి, శ్రీధర్, గురుచరణ్, బాబాగౌడ్, మహబూబ్ తదితరులున్నారు.

అయోధ్యలో భిక్కనూరు దంపతుల సేవ



భిక్కనూరు : అయోధ్యలోని బాలరాముడిని దర్శించుకున్న భక్తులకు ఉచితంగా భాగ్యనగర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం సేవలో భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన దంపతులిద్దరు నెల రోజులుగా సేవలు అందిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన శనిశెట్టి వెంకటేశం గుప్తా–సుభద్ర గతనెల 25వ తేదీన అయోధ్యకు చేరుకున్నారు. అక్కడ భాగ్యనగర్ సేవాసమితి ఆధ్వర్యంలో భక్తులకు నిర్వహిస్తున్న అన్నదానంలో వారు పాలు పంచుకుంటున్నారు. అంతేకాకుండా భక్తుల అన్నదానానికి అవసరమైన సామగ్రిని కూడా తెప్పిస్తూ శ్రీరాముడి సేవలో తరిస్తున్నారు. సోమవారం శనిశెట్టి వెంకటేశంగుప్తా –సుభద్రలు 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ అయోధ్యలో బాలరాముడిని దర్శనం అద్భుతమన్నారు. ప్రతిరోజు భాగ్యనగర్ సేవా సమితి ఆధ్వర్యంలో 30వేల మంది భక్తులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం రాత్రి టిఫిన్‌ను అందజేస్తున్నామన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : విజయ సంకల్ప బస్సుయాత్రను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దొరబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రామాలయంలో నిర్వహించిన సమావేశంలో రామాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ప్రతి నియోజకవర్గంలో విజయ సంకల్ప యాత్రలో బీజేపీ కార్యకర్తలు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సున్నం సాయిలు, జిల్లా ఓబీసీ కార్యదర్శి శంకర్ గౌడ్, నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్, మేకల రాములు, పెర్క రాములు తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ





పెద్దకొడప్‌గల్‌లో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు, రాజంపేటలోని బస్వన్నపల్లిలో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రంలో రూ. 10 లక్షలతో 9వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సీసీ రోడ్డు నిర్మాణానికి సోమ వారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, మోహన్, పండరి, సంజీవ్, శ్రీనివాస్ గౌడ్, మాణిక్ రెడ్డి పాల్గొన్నారు.

రాజంపేట : రాజంపేట మండలం బస్వన్నపల్లిలో సోమవారం సీసీ రోడ్డు పనులను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండల యువ నాయకులు ప్రణీత్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు సంజీవ రెడ్డి, ఎంపీటీసీ సుమలత ఉన్నారు.

ఎరువుల నిల్వలను నమోదు చేయాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

మాచారెడ్డి : ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు ఈ–పాస్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి సూచించారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లోని ఎరువుల దుకాణాలతో పాటు పాల్వంచ మండలం ఫరీదుపేటలోని సింగిల్ విండోను సందర్శించి ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఆమె వెంట కామారెడ్డి ఏడీఏ అపర్ణ, ఆయా గ్రామాల ఏఈవోలు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు



ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు సమక్షంలో..

భిక్కనూరు : మండలంలోని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ స్వగ్రామం బస్వాపూర్‌లో పలువురు బీఆర్ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. భిక్కనూరు పట్టణ ప్రధాన కార్యదర్శి నర్మాల రాంచంద్రం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, మండలం అధ్యక్షుడు భీం రెడ్డి, పార్టీ నాయకులు ఉన్నారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డికి చెందిన మాజీ ఎంపీటీసీ గోవింద్ నాయక్ సోమవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ప్రధాని మోదీ వర్చువల్ ప్రోగ్రాంలో ప్రజాప్రతినిధులు



భిక్కనూరు : మండలంలోని సిద్దరామేశ్వరాలయం ఆలయం వద్ద అమృత్ భారత్ స్టేషన్‌లో భాగంగా రైల్వేబ్రిడ్జి వర్చువల్‌గా ప్రధాని మోదీ సోమవారం ప్రారంభించారు. 554 రైల్వే స్టేషన్లలో పునరుద్ధరణ పనుల్లో భాగంగా దేశ ప్రధాని దీనిని ప్రారంభించగా మండలానికి చెందిన బీజేపీ నాయకులు హాజరయ్యారు. ఎంపీటీసీ బండి చంద్రకళ, మండల రైల్వే కోఆర్డినేటర్ స్వామి, మాజీ సర్పంచ్ బండి రాములు, మండల ఓబీసీ అధ్యక్షుడు ఉప్పరి రమేష్, తదితరులు ఉన్నారు.

నియామకం



మహేశ్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఇలియాస్

కామారెడ్డి టౌన్ : యువజన కాంగ్రెస్ నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా ఉగ్రవాయి గ్రామానికి చెందిన పెద్దోళ్ల మహేష్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఐరేని సందీప్, జిల్లా నాయకులు ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు వేతనాలివ్వాలి



దోమకొండ : జీపీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి వెంటనే ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని పంచాయితీ కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. ఆర్నెళ్లుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు రావడం లేదన్నారు. ఎస్‌టీవోలో రెండు నెలలకు సంబంధించిన చెక్కులు ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం ప్రతినిధులు కూర సంతోష్‌కుమార్, నర్సింలు, శివరాజ్, శంకర్, వెంకటి, బాల్‌రాజ్ తదితరులున్నారు.

ప్రమాదబీమా చెక్కుల అందజేత

భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన బాధిత రైతులకు సోమవారం బీమా చెక్కులను సొసైటీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అందజేసి మాట్లాడారు. గ్రామానికి చెందిన కొండల్‌రెడ్డి, బాల్‌రెడ్డి సొసైటీలో సభ్యులుగా ఉన్నారు. ఇటీవల వారు మృతిచెందగా, ఒక్కొక్కరికి రూ. 1 లక్ష చొప్పున ప్రమాద బీమా అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో శ్రీనివాస్, మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ స్వామి, సొసైటీ పాలకవర్గసభ్యులున్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరం



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని గర్గుల్ గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు 216 మంది కంటి పరీక్షలను నిర్వహించి 38 మంది కంటి అపరేషన్ల నిమిత్తం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వీరభద్రస్వామి ఆలయంలో పూజలు



మద్నూర్(జుక్కల్) : మండలంలోని కోడిచిర గ్రామానికి సమీపంలోని గుట్టపై ప్రసిద్ధి చెందిన చెన్నమ్మ కోరి వీరభద్ర స్వామి సోమవారం భక్తులు అన్నప్రసాదం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వీరభద్రుడికి అన్నం, పెరుగుతో అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

శివరాత్రి ధ్వజారోహణం



కామారెడ్డి అర్బన్ : ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కామారెడ్డి కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం మహాశివరాత్రి పర్వదినం ముందస్తు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వికాస్‌నగర్ ఓంశాంతి కేంద్రంలో శివధ్వజారోహణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు గంగా, లత, సంతోషిణి తదితరులు పాల్గొన్నారు.

పాలక వర్గ సభ్యులకు సన్మానం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఒంటర్‌పల్లి జీపీ మాజీ సర్పంచ్ జనిగె రాజయ్య, పాలక వర్గ సభ్యులను సోమవారం కార్యదర్శి స్రవంతి, పాఠశాల హెచ్‌ఎం రాములు, సిబ్బంది సంయుక్తంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఐదేళ్లుగా గ్రామ సమస్యలపై స్పందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు భాగ్యలక్ష్మి, మురళికృష్ణ, శ్రీలత, గ్రామ పంచాయితీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడికి..



కామారెడ్డి టౌన్ : నూతనంగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రణాప్రతాప్‌ను సోమవారం పట్టణ బంజారా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ భూక్యా రాజు, నాయకులు గణేష్‌నాయక్, ప్రవీన్‌నాయక్, నొసిలాల్ ఉన్నారు.

సంక్షిప్తం

వాహనాల తనిఖీ

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో ఉన్న ప్రధాన రహదారిపై సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. దీంట్లో భాగంగా ఏఎస్సై అబీద్ బేగ్ వాహన దారులకు ధృవపత్రాల తనిఖీ చేశారు. హెల్మెట్ లేని వాహనాదారులకు చలాన్ విధించారు. ఆయన వెంట కానిస్టేబుల్ ప్రమోద్, మోబీన్, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలో..

రాజంపేట : మండలంలోని ఆర్గొండ ప్రాథమిక, బస్వాన్నపల్లి ఉన్నత పాఠశాలలను ఎంఈవో రామస్వామి సందర్శించారు. మధ్యాహ్న భోజనం విషయమై ఉపాధ్యాయులతో, విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బాన్సువాడ రూరల్ : మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ ఉంటుందని తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. బాన్సువాడ పట్టణంతో పాటు గ్రామీణ లబ్ధిదారులకు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మంజూరైన చెక్కులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

ఇసుక దళారులపై చర్యలు తీసుకుంటాం

రాజంపేట : రాజంపేట మండలం నడిమితండా పరిధిలో ఇసుక మాఫియా విషయంపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. సోమవారం అక్రమ ఇసుక రవాణా జరుగుతుందని గ్రామస్తుల ద్వారా సమాచారం అందడంతో రెవెన్యూ, ఫారెస్టు, పోలీసు అధికారులు ఘటనాస్థలానికి చేరుకోగా అప్పటికే ఇసుక దళారులు పరారయ్యారన్నారు.

భక్తి శ్రద్ధలతో షాబాషావలి ఉర్సు

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డిలో షాబాషావలి దర్గా ఉర్సు ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. షాబాషావలి ఉర్సులో భాగంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం దర్గా వరకు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం సందల్ సమర్పించారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు తదితరులున్నారు.

పంచాయతీకి కంప్రం అందజేత

పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు సుభాష్ జీపీ కంప్రం (స్టీల్ పాడే)ను అందజేశారు. ఈ సందర్భంగా జీపీ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ అవసరం ఉన్న వారు స్టీల్ పాడేను జీపీ నుండి తీసుకెళ్లచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కరడ్‌పల్లి మాజీ సర్పంచ్ మృతి



రామాంజన్ రెడ్డి (ఫైల్)

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కరడ్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గురుడు రామాంజన్‌రెడ్డి (86)అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. 30 ఏళ్ల క్రితం రామాంజన్‌రెడ్డి మూడు పర్యాయాలుగా ఏకగ్రీవంగా ఎన్నికై 17 ఏళ్ల పాటు సర్పంచ్‌గా పనిచేశారు. ఆయనకు ముగ్గురు కుమారులు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవరెడ్డి, కూతురు విజయ ఉన్నారన్నారు. కాగా సోమవారం కరడ్‌పల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.